


పొగలు కక్కుతున్న ఇడ్లీని సుతారంగా చేత్తో విరిచి, దాన్ని చట్నీలో ముంచి తర్వాత అదే ప్లేట్లో ఓ పక్కగా ఉన్న కారప్పొడి గుట్ట మీద దాన్ని అలవోకగా అద్ది, నోట్లో నీళ్లూరుతుండగా, ఆబగా దాన్ని నోట్లోకి సరఫరా చేసి, తద్వారా ఒంట్లోని సర్వాంగాలకూ పాకిన సుఖానుభూతితో మళ్లీ ఇడ్లీ ముక్కను తుంచబోతూ తలెత్తి చూసిన సన్యాసిరావుకు రెండు టేబుల్స్ అవతల తనలాంటి పనిలోనే నిమగ్నమై ఉన్న ఓ వ్యక్తి కనిపించాడు.

ఓవైపు 'ఇంకా ... ఇంకా ...' అని జిహ్వ పీక్కు తింటున్నా, మెద డందించిన ప్రేరణతో ఆ కోరికను తాత్కాలికంగా నియంత్రించి, ఆ వ్యక్తి వైపు పరీక్షగా చూశాడు సన్యాసిరావు. అలా నాలుగు ప్లేట్ల ఇడ్లీల్ని తింటున్నంతసేపూ మధ్య మధ్య అతడి వైపు చూస్తూనే ఉన్నాడు సన్యాసిరావు.

# ది ఛేజ్


## 'సీతా సత్య'

ఎనిమిదో ఇడ్లీ తినడం పూర్తయ్యాక కమ్మటి ఫిల్టర్ కాఫీని ఎంతో ప్రీతిగా తాగి, లేచి నిలుచున్నాడు. అప్పటి కతడి నాకర్షించిన వ్యక్తి కౌంటర్ వద్ద నిలబడి ఉన్నాడు. వడివడిగా నడిచి ఆ వ్యక్తిని చేరుకునేలోగా అతడు బిల్లు చెల్లించి హోటల్ నుంచి బయటపడ్డాడు.

చూపు నతడి మీదే ఉంచి, తను కూడా బిల్లు చెల్లించి బయటపడ్డాడు సన్యాసిరావు. అప్పటికే ఆ వ్యక్తి రోడ్డును క్రాస్ చేసి ఎదురుగా ఉన్న బస్‌స్టాప్‌లో నిలబడ్డాడు. రోడ్డు కిటు వైపు నుంచి ఆ వ్యక్తి వైపు కళ్లు చిట్లించి చూశాడు సన్యాసిరావు.

'ఊహూఁ, లాభం లేదు' అనుకుని రోడ్డు దాటి బస్‌స్టాప్‌లో అతడికి మూ డడుగుల దూరంలో నిలబడి అతణ్ని శ్రద్ధగా పరిశీలించసాగాడు. అయిదారు నిముషా లలా చూడగా చూడగా అతడి గుండె మామూలుగా కొట్టుకోవడం మానేసి ఆనందంగా కొట్టుకోవడం ప్రారంభించింది.

'ఎస్! అతడే ... నిస్సందేహంగా వాడే వీడు!'



ఒక్కసారి ఆ విషయం నిర్ధారణ కాగానే, మరుక్షణం అతడికి దగ్గరగా జరిగి, గుండెల్లోని ఆనందం గొంతుకలోకి తోసుకువస్తూండగా అడిగాడు సన్యాసిరావు — "మీరు ..."

పక్కనే మాటలు వినబడడంతో చివ్వున తలెత్తి చూశాడా వ్యక్తి ప్రశ్నార్థకంగా.

"సుబ్బారావుగారు కదూ!" ఆశ్చర్యంతోనూ, ఆనందంతోనూ సన్యాసిరావు ఇంకా తన మాటను పూర్తి చేయకుండానే సుబ్బారావు అనబడే సదరు వ్యక్తి తుపాకీ చప్పుడుకు బెదిరిన కుందేలులా పేవ్‌మెంట్ మీద నుంచి ఎగిరి రోడ్డు మీదకు దూకి పరుగు లంకించుకున్నాడు.

దారిలో అడ్డొచ్చిన మనుషుల మీద నుంచీ, స్కూటర్ల మీద నుంచీ లాఘవంగా దాటుకుంటూ కన్ను మూసి తెరిచేంతలో రోడ్డు కటువైపు చేరుకున్నాడు సుబ్బారావు.

తన అంచనా తప్పనందుకు మనసులో సంతోషం కలిగినా, అనుకోకుండా దొరికిన అవకాశం చేజారిపోతోం దనే బాధతో పారిపోతున్న సుబ్బారావు వైపు చేష్టలు దక్కి చూస్తూండిపోయాడు సన్యాసిరావు కొంచెంసేపు.

జరిగిన సంఘటన నుంచి సన్యాసిరావు కోలుకుని రోడ్డు మీదకు చూసేసరికి అప్పటికే రోడ్డుకు అటువైపు చేరుకున్నాడు సుబ్బారావు. అలుపు తీర్చుకునేందుకో, అనుమాన నివృత్తి కోసమో ఒక్క క్షణం ఆగి సన్యాసిరావు వైపు చూశా డతడు.

సన్యాసిరావు ఇక ఏ మాత్రమూ ఆలస్యం చేయలేదు. చినుక్కీ, చినుక్కీ మధ్య తడవకుండా ప్రయాణం చేసిన సహదేవుడిలా ఆటోలనూ, కార్లనూ, గేదెలనూ, మనుషులనూ చాకచక్యంగా తప్పించుకుంటూ రెప్పపాటులో రోడ్డు కటువైపుకు చేరుకున్నాడు.

ప్రమాదం పసిగట్టిన సుబ్బారావు మెయిన్‌రోడ్డు మీద తనకు రక్షణ లేదని గ్రహించినవాడై, హోటల్ పక్కగా ఉన్న సందులోకి జారుకున్నాడు.

సరిగ్గా సన్యాసిరావు రోడ్డుకు అటు వైపు చేరుకునేసరికి హోటల్ పక్క సందు మొదట్లో గాలికి రెపరెపలాడుతూ అంతలోనే మాయమైన సుబ్బారావు పచ్చచొక్కా అంచు కనిపించిం దతడికి.

పచ్చ చొక్కాకు మనసులో జోహార్లర్పించి, మహోత్సాహంతో పరుగును కొనసాగించాడు సన్యాసిరావు.


మధ్యమధ్యలో వెనుకకు తిరిగి చూస్తూ, పిక్కల్లోకి బలం తెచ్చుకుని మరీ పరుగెత్తుతున్నాడు సుబ్బారావు. సుబ్బారావు తనవైపు చూసినప్పుడల్లా రెట్టించిన ఉత్సాహంతో ఊపిరి బిగబట్టి మరింత వేగంతో బాణంలా దూసుకుపోసాగాడు సన్యాసిరావు.

దారిలో ఎదురొచ్చిన ఒక ముసలావిడ తల మీదనుంచి తనదైన రీతిలో అమోఘంగా లంఘించి, ఆవిడ తిట్లు ఆ వీధి అంతటా ప్రతిధ్వనిస్తూంటే తట్టుకోలేక పక్కసందులోకి తిరిగాడు సుబ్బారావు.

ఈలోగా సన్యాసిరావు ముందూ వెనుకా చూసుకోకుండా పరుగెత్తుతున్నాడేమో, ఆ ముసలావిడని ధన్‌మని ఢీకొట్టబోయి, ఆఖరి క్షణంలో ఆవిడ చేయి పట్టుకుని పక్కకు లాగి పక్కసందులోకి తుర్రుమన్నాడు.

తన తల మీద నుంచి ఒకడు దూకడం, అంతలోనే మరొకడు పరుగున వచ్చి తన చేయి పట్టుకుని లాగడంతో బెంబేలెత్తిపోయిన ఆ ముసలావిడ చెవి కోసిన మేకలా, "దొంగ! దొంగ!" అని మహా కర్ణకఠోరంగా అరవసాగింది — రెండు చేతులతోనూ గుండెల మీద బాదుకుంటూ.

సామాజిక స్పృహ కలిగిన పౌరులు ఆ




ఇరుకు సందులో ఎక్కువగానే ఉన్న కారణంచేత అరక్షణంలో ఆరుగురూ, క్షణం పూర్తయ్యేసరికి అరవై మందీ పోగైపోయి ముసలావిడ చూపించిన దిక్కుగా పరుగులు తీయడం ప్రారంభించారు.

ముందు సుబ్బారావూ, వెనుక సన్యాసిరావూ, వా ళ్లిద్దరికీ పది గజాల దూరంలో "పట్టుకోండి పట్టుకోండి! తన్నండి తన్నండి!" అని అరుస్తూ పౌరులు పరుగులు తీయడం ప్రారంభించారు.

పరిస్థితి పసిగట్టిన సుబ్బారావూ, సన్యాసిరావూ ఒక్క క్షణం బిత్తరపోయినా, అంతలోనే తేరుకుని, "పట్టుకోండి! తన్నండి!" అని అరుస్తూ తమ పరుగు వేగం తగ్గించి, కాసేపటికి తమ వెనుకగా వస్తున్న జనంతోపాటు కలిసి పరుగెత్తడం ప్రారంభించారు.

అలా అందరూ కాళ్లు నొప్పులు పుట్టేవరకూ పరుగెత్తి పరుగెత్తి ఎవరి పనులు వారికి గుర్తుకు రావడంతో వెనుదిరిగి, "దొంగ వెధవ! తప్పించుకుపోయాడు!" అని నిట్టూరుస్తూ నీరసంగా నడకలు ప్రారంభించారు.

జనంలో కలిసిపోయి నడుస్తూనే ఉన్నాడు కానీ, సుబ్బారావు చూపులు మాత్రం సన్యాసిరావుమీదే ఉన్నాయి. ఊరు కాని ఊళ్లో తనను వీ డెలా గుర్తుపట్టాడో అర్థం కావడం లే దతడికి.

'సుబ్బారావు ఒంటరిగా ఎప్పుడు దొరుకుతాడా?' అని ఉవ్విళ్లూరుతూ క్రీగంట అతణ్ని గమనిస్తూ నడవసాగాడు సన్యాసిరావు. కాసేపటికి గుంపు అంతా చెల్లాచెదురై గొర్రెలన్నీ తలోదారీ పట్టగా, సుబ్బారావూ, సన్యాసిరావూ మాత్రం మిగిలా రక్కడ.

సన్యాసిరావు ఒక్కంగలో ముందుకు దూకి, సుబ్బారావు చేయందుకుని, "మీ పేరు సుబ్బారావు కదూ!" అన్నాడు అతణ్ని తేరిపార చూస్తూ.

సుబ్బారావు అడ్డంగా తలూపుతూ, "కాదు, అప్పారావు" అన్నాడు మొండిగా — ఆ ఉపాయం తన కంతవరకూ తట్టనందుకు తనను తానే తిట్టుకుంటూ.

"మీ ఆవిడ పేరు సుబ్బలక్ష్మి కదూ!" అన్నాడు సన్యాసిరావు తిరిగి.

"కాదు, వెంకటలక్ష్మి." అన్నాడు సుబ్బారావు తనే తెలివితేటలకు తానే మురిసిపోతూ.

"మీది అంబాజీపేట దగ్గర పుల్లేటికుర్రు కదూ!" అన్నాడు సన్యాసిరావు మళ్లీ.

"కాదు, భీమవరం దగ్గర పెన్నాడ" అన్నాడు సుబ్బారావు ధీమాగా.

"మీ కిద్ద రబ్బాయిలు కదూ!" అన్నాడు సుబ్బారావు — 'ఈసారెక్కడికి పోతావ్‌లే' అన్నట్టుగా మొహంపెట్టి.

"కాదు, నా కిద్దరూ అమ్మాయిలే!" అన్నాడు సుబ్బారావు 'మళ్లీ బోల్తా కొట్టావ్‌రా!' అనుకుంటూ.

"వాళ్ల పేర్లు సురేష్, నరేష్ కదూ!" అన్నాడు సన్యాసిరావు.

"కాదు, రమణి, రాగిణి!" అన్నాడు సుబ్బారావు ఫక్కున నవ్వి.

సన్యాసిరావు, సుబ్బారావు చేతిని వదిలిపెట్టి, జేబులో నుంచి మడతపెట్టిన న్యూస్ పేపర్‌ను విప్పి రెండవ పేజీలో ఉన్న ఫోటోను చూపించి, "ఇదేవిటి మరి?" అన్నాడు పాశుపతాస్త్రం ప్రయోగించిన అర్జునుడిలా:

ఆ ఫోటో సుబ్బారావుది. ఫోటో పైన 'కనబడుటలేదు' అన్న శీర్షికా, కింద అతడి భార్య, పిల్లల పేర్లూ ముద్రించబడి ఉన్నాయి.

సుబ్బారావు ముఖంలోకి చావు కళ తోసుకొచ్చింది. రెండు చేతులూ జోడించి,

"మీకు పుణ్యం ఉంటుంది. మా ఆవిడ ఇస్తానన్న డబ్బు కాశపడి నన్ను మాత్రం ఆ రాక్షసికి అప్పగించకండి!" అని బతిమాలుకున్నాడు సన్యాసిరావు.

"ఊహుం, అదేమీ కుదరదు!" అన్నాడు సన్యాసిరావు.

"బాబ్బాబు!" అన్నాడు సుబ్బారావు.

"చచ్చినా సరే, మిమ్మ ల్నొదిలిపెట్టేది లేదు!" అన్నాడు సన్యాసిరావు అతగాడిని రెండుచేతుల మధ్యా బంధించి.

"ప్లీజ్!" అన్నాడు సుబ్బారావు.

"నో ప్లీజ్!" అన్నాడు సన్యాసిరావు.

"న న్నొదిలేస్తే వచ్చే జన్మలో మీ కడుపున పుట్టి మీకు తలకొరివి పెట్టి ఋణం తీర్చుకుంటాను" అన్నాడు సుబ్బారావు, సెంటిమెంట్‌ను ఉపయోగిస్తూ.

"కన్న పిల్లల్నే మేపలేక ఈ జన్మలో నరకం అనుభవిస్తున్నాను. అందుకే జన్మరాహిత్యం కోసం పూజలూ, గట్రా చేస్తున్నాను. మళ్లీ వచ్చే జన్మంటూ న న్నిబ్బంది పెట్టకు!" అన్నాడు సన్యాసిరావు.వైరాగ్య ధోరణిలో.

"అయితే ఈ జన్మలోనే మీ ఇంటికొచ్చి ఉండిపోతాను. బాబ్బాబు, కాదనకండి!" అన్నాడు సుబ్బారావు దైన్యంగా చూస్తూ.

"ఊహుం!" అన్నాడు సన్యాసిరావు పట్టు వీడకుండా —

ఇహ ఏం చేయాలో తోచక, సన్యాసిరావు వైపు పరీక్షగా చూడసాగాడు సుబ్బారావు. కాస్సేపలా చూసిన తర్వాత ఉన్నట్టుండి అతడి బుర్రలో మెరుపు మెరిసింది. ఆ వెనువెంటనే అతడి మొహంలోకి జీవకళ తోసుకొచ్చింది.

అంతే ! ఒక్క ఊపుతో సన్యాసిరావును విడిపించుకుని రెండు చేతుల్నీ పాంటు జేబుల్లో ఉంచుకుని విలాసంగా తల నెగరేస్తూ — "మీ పేరు సన్యాసిరావు కదూ?" అన్నాడు సుబ్బారావు తాపీగా.

సన్యాసిరావు గతుక్కుమన్నా డా మాటలకు. "ఊహూ.... జోగారావు" అన్నాడు బింకంగా.

"మీ ఊరు చోడవరం కదూ?" అన్నాడు సుబ్బారావు కళ్లెగరేస్తూ.

"కాదు. వడ్డాది." అన్నాడు సన్యాసిరావు కళ్లు దించుకుని.

"మీ ఆవిడ పేరు కనకమహాలక్ష్మి కదూ?" అన్నాడు సుబ్బారావు గద్దిస్తూ.

"కాదు. గౌరమ్మ." అన్నాడు సన్యాసిరావు బిక్క మొహంతో.

"మీ పిల్లల పేర్లు సింహాచలం, అప్పలకొండా కదూ?" అన్నాడు సుబ్బారావు నిలదీస్తూ.

"కాదు, పైడితల్లీ, కొండబాబూ" అన్నాడు సన్యాసిరావు గద్గద స్వరంతో. సన్యాసిరావు గజగజా వణికిపోతూండగా, సుబ్బారావు తన జేబులోంచి న్యూస్ పేపర్‌ను బయటకు తీసి, ముడుతలు సాపు చేసి మూడో పేజీలో ఉన్న ఫోటోను చూపించి "ఇదేవిటి మరీ !" అన్నాడు సుదర్శనాయుధాన్ని ప్రయోగించిన శ్రీకృష్ణపరమాత్మలా చిరునవ్వులు చిందిస్తూ.

ఆ ఫోటో సన్యాసిరావుదే ! దాని క్రింద అతడి భార్యా, పిల్లల పేర్లూ అతణ్ణి పట్టి అప్పగించే వారి కీయబడే బహుమతి వైనమూ ఉన్నాయి వివరంగా.

"బా బ్బాబు... న న్నా గయ్యాళికి అప్పచెప్పి పాపం మూట కట్టుకోకండి" అన్నాడు సన్యాసిరావు దీనంగా చూస్తూ.

"మరెలా?! నాకు డబ్బు కావాలే" అన్నాడు సుబ్బారావు జేబులోంచి సిగరెట్ తీసి వెలిగించి విలాసంగా పొగ వదులుతూ.

"నే నింటి కెళ్తే నా బతుకు కుక్కతో సమానం. మా అత్తగారికి పది గేదెలున్నాయి



కదా, వాటితోపాటే నేనూ సుఖపడిపోతా నని ఆశపడి మా నాన్న నన్ను ఇల్లరికం పంపించాడు. ఆ పది గేదెలతోపాటు, పదకొండో గేదెకు కూడా ఇంతకాలమూ చాకిరీ చేసుకుంటూ బతికినా, ఏనాడూ చుట్టముక్క కూడా నోచుకోకుండా వాళ్లనూ, వీళ్లనూ ముష్టెత్తుకుంటూ బతికాను!" అన్నాడు సన్యాసిరావు. కళ్లల్లోనుంచి నీళ్లు జలజలా రాలుతుండగా.

సుబ్బారావుకు తన పరిస్థితి గుర్తొచ్చి గొంతు పూడుకుపోయింది.

"పదెకరాల మాగాణి ఉంది కదా, తిండి గింజలకు లోటుండదని కక్కుర్తిపడి సుబ్బలక్ష్మికి కట్టబెట్టి ఇల్లరికం తోలేశాడు మా నాన్న. షోగ్గా బయటికొచ్చి ఏనాడూ సిగరెట్ ముక్కయినా కాల్చుకోనీయకుండా కాల్చుకుతింది నా రాకాసి పెళ్లాం ఇంతకాలమూ!" అన్నాడు సుబ్బారావు డగ్గుత్తికతో.

సన్యాసిరావు ఆలోచనలో పడ్డాడు. జేబులోనుంచి చుట్ట తీసి వెలిగించి రెండు దమ్ములు లాగి, "అద్భుతమైన ఐడియా! మిమ్మల్ని మీ ఇంట్లో అప్పచెప్తే వచ్చే డబ్బు మీకే ఇచ్చేస్తాను. అలాగే నన్ను మా ఆవిడకు అప్పచెప్పి, ఆ డబ్బును నా కిచ్చేయండి. ఎంతలేదన్నా వాళ్లిచ్చే డబ్బు ఆరేడు నెలలవరకూ మీకు సిగరెట్లకీ, నాకు చుట్టలకూ సరిపోతుంది.

"తర్వాత వీలు చూసుకుని మళ్లీ పారిపోదాం! మళ్లీసారి ఇవే మొహాలతో వెళ్తే మన వీపులు వాచిపోతాయి కనుక మారు వేషాలు వేసుకుని మిమ్మల్ని నేనూ, నన్ను మీరూ ఇళ్లదగ్గర అప్పజెప్పి మరికొంత కాలం జల్సా చేద్దాం, సరేనా!" అన్నాడు.

సన్యాసిరావు మాట లింకా పూర్తి కాకుండానే సుబ్బారావు ఆనందంతో అతడిని కౌగలించుకుని, కేరింతలు కొట్టాడు.

అదే సమయానికి కొంచెం ముందుగా మొగుళ్లను వెతుక్కుంటూ చోడవరం నుంచి వచ్చిన కనకమహాలక్ష్మి, పుల్లేటికుర్రు నుంచి వచ్చి సుబ్బలక్ష్మి ఆ ఊరి బస్‌స్టాండ్‌లో కలుసుకున్నారు.

ముందుగా తమకున్న పది గేదెల గురించి కనకమహాలక్ష్మి చెపితే, తమకున్న పదెకరాల మాగాణి గురించి సుబ్బలక్ష్మి చెప్పుకుంది.

తర్వాత బద్ధకపు దున్నపోతులాంటి తన మొగుడి గురించి కనకమహాలక్ష్మి, దిగుబడి లేని కొబ్బరిచెట్టులాంటి తన మొగుడి గురించి సుబ్బలక్ష్మి చెప్పుకున్నారు.

ఎంత ఏబ్రాసివాడైనా మొగు డనేవాడు లేకపోతే రంగు రంగుల చీరలూ, ఖరీదైన నగలూ అలంకరించుకునే అవకాశం ఆడవాళ్లకు లేదు కనుక, తప్పని పరిస్థితుల్లో మొగుళ్లకోసం పేపర్లో ప్రకటన లిచ్చామని కూడా చెప్పుకున్నారు.

అలా అలా కబుర్లు చెప్పుకుంటూ ఊళ్లోకి నడుచుకుంటూ వెళ్లిన వా ళ్లిద్దరికీ నడిరోడ్డు మీద కేరింతలు కొడుతున్న సుబ్బారావూ, సన్యాసిరావూ కనబడటంతో, కళ్లముందు కనిపిస్తున్న దృశ్యాన్ని ఓ పట్టాన నమ్మలేక ఇద్దరూ పరస్పరం గిల్లుకుని, అది కల కాదని నిర్ధారించుకుని, "ఏమయ్యోయ్!" అని గట్టిగా అరిచారు ముక్తకంఠంతో.

టెక్నికలర్‌లో కలలు కంటున్న మగవాళ్లిద్దరూ వెనుదిరిగి చూసి, వెనువెంటనే ఒకరి నొకరు చెంపదెబ్బలు కొట్టుకుని, తాము చూస్తున్న మనుషు లిద్దరూ ఇలలోని వాళ్లే కానీ, కలలోని వాళ్లు కారనే నిర్ధారణ కొచ్చి, మిల్కాసింగ్‌ను స్మృతిపథంలోకీ తెచ్చుకుని దౌడు తీయడం ప్రారంభించారు.

మరుక్షణంలో చీరకొంగులు బిగించి, వారి వెనుకే పి.టి. ఉషా, అశ్వనీ నాచప్పలను స్ఫురణకు తెచ్చే విధంగా మొక్కవోని విశ్వాసంతో పరుగులు తీయడం ప్రారంభించారు ఆ అతివ లిద్దరూ. ★